

# వేటప్పు

## ఘండికోట బ్రహ్మాజీరావు

నూరు రూపాయల నోటు మరోమాటు చూచి మడిచి పర్సులో పెట్టుకోబోతున్న శివయ్య ఒక్కసారి నీరువిడిచి పోయాడు.

ఎదురుగా రామారావు నిలబడ్డాడు

అతని కళ్ళలో నిప్పులు రేగు తున్నాయి.

"శివయ్యా! ఆ నోటు ఇలా తే!" రామారావు కోపంగా అన్నాడు.

శివయ్య దానిని గట్టిగా పట్టు కున్నాడు.

"ఇయ్యి ముందు!" గర్జించాడు రామారావు.

శివయ్య దీనంగా రామారావు ముఖం లోకి చూచాడు.

"లైసెన్సు తొందరగా తయారు చేయించడానికి కారణ మిదేనా? బతిమాలి బతిమాలి వారంరోజులలో ఇవ్వవలసిన

దానిని రెండురోజులలో ఇప్పించావు!"

శివయ్య జవాబు చెప్పలేదు. చూపులు కిందకు తిప్పుకున్నాడు.

"ఆఫీసులో ఎవరూ లేరనుకున్నావు. ఉన్న ఒక్క బంట్రోతును బజారుకి పంపించావు. నీకన్నా ముందు ఆఫీసుకు వచ్చి, మూలనున్న బీరువాలోని ఫైళ్ళు చూస్తున్నానన్న సంగతి కూడా తెలుసు కోలేక పోయావు. అంతే. లంచం పుచ్చుకునేటప్పుడు కళ్ళు మూసుకు పోతాయి."

శివయ్య ముఖం ఉదాసీనంగా ఉంది. పిడికిలి బిగించి నోటు బయటికిపోకుండా పట్టుకున్నాడు.

"నీ కొచ్చిన వయస్సు ఇంకెవరి కొచ్చింది? ఈ ఎంగిలికూడు కెందుకు కక్కుర్తి?"

రామారావు కళ్ళలోకి చూస్తూ నోటు జేబులో తొందరగా పెట్టుకొని గట్టిగా జేబు నొక్కి పట్టుకున్నాడు శివయ్య.

"శివయ్యా! ఇది లంచం సొమ్ము. కష్టార్జితం కాదు. పిల్లలు కలవాడిని. ఇటువంటిదాన్ని గ్రహించడంకన్న పాపమేముంది?"

శివయ్య పెదవులమీద కాంతిలేని చిరునవ్వొకటి కదిలింది.

"అవును రామం! పిల్లలు కలవాడిని కాబట్టే ఈ పని..." అన్నాడు శివయ్య.

"ఈ మాట అనడానికి సిగ్గు వెయ్యడం లేదా! ఇంతకన్నా పెళ్ళాం, పిల్లలతో ముష్టెత్తుకోడం మంచిది. లేకపోతే పస్తులుండడం మేలు."

"అవును. — ఒంటరిగాడివి. నీకేం తెలుసు ఈ సంసారం పోషించడం!"

"ఒక్కమాట శివయ్యా! ఈ డబ్బు న్యాయంగా ఆర్జించినదేనా?"

"ఇది వెంకటనారాయణగారు సంతోషంగా ఇచ్చినది."

"ఎవరికి?... ప్రభుత్వానికా?"

"కాదు! పని పూర్తి చేయించిన వారికి".

"చూడు శివయ్యా! ఈ పనికిమాలిన మాటలు కట్టిపెట్టు. నోటు ఇలా తే!"

"బాబ్బాబూ! ఈ ఒక్కసారికి ఊరుకో! ఇకమీద పుచ్చుకోనులే... కావలిస్తే ప్రమాణం చేస్తాను."

"ఎన్నిసార్లు చేయలేదు. వాటిమీద నాకు నమ్మకం పోయింది. నోటు ఇచ్చి దానిని వెంటనే ఆ వెంకటనారాయణ గారికి పంపి క్షమాపణలు వేడు కుంటాను."

"వద్దు! అటువంటి పని చెయ్యొద్దు!"

రామారావు కోపం పట్టలేకపోయాడు. బలంగా శివయ్యచేతిని లాగి జేబులోనున్న నోటును తీసాడు. పెనుగులాటలో జేబు చిరిగిపోయింది.

శివయ్య నిస్సహాయంగా రామారావు కళ్ళలోకి చూశాడు. పోరాటంలో ఓడి పోయాడు.

"ఉన్న ఈ ఒక్క చొక్కా తొడు

క్కోడానికి వీలులేకుండా చిరిగిపోయింది తమ్ముడూ! ఆదివారంనాడు ఉతుక్కొని వారం అంతా వాడుతున్నాను."

రామారావు ముఖం వివర్ణమయింది. చొక్కా జేబుదగ్గర చిరిగిపోయింది. తొందరపాటుకు పెదవి కరుచుకున్నాడు.

"వెంకటనారాయణగారు ఏ పదో ఇస్తారని నీ కాళ్ల పట్టుకొని ఈ పని చేశాను. మంచో ...పాడో... పది రూపాయల దగ్గిర వంద రూపాయలు వస్తే అదృష్టం పండిందని పగటి కలలు కన్నాను. పెళ్ళానికో, పిల్లలకో... పాపం బొత్తిగా వాళ్ళు చింకివాటితోనే కాలం గడుపుతున్నారు ... బట్టలేనా కొందామనుకున్నాను."

రామారావు చేతిలో నున్న నోటు మడతలు విప్పి సరిచేస్తూ చూపులు దించుకున్నాడు.

"బట్టల మాటకేం...నాలుగు రోజులయి రాత్రిపూట పస్తులుంటున్నారు పిల్లలు—జీతాలు వచ్చేవరకేనా రెండు పూటలా తిండి దొరుకుతుందని సంతోషించాను."

రామారావు ఆ మాటలు వినలేక పోతున్నట్లు చెవులు మూసుకున్నాడు. హృదయంలోంచి బాధగా బయటపడుతున్న పలుకుల కోతకు తట్టుకోలేనట్లు కంపిస్తున్నాడు.

"తమ్ముడూ! నిన్ను నిందించడం వల్ల ప్రయోజనమేముంది?... లేనిపోని ఆశలలో శుష్కించిన వాళ్ళ కళ్ళలో ఏముంటాయి?... పెళ్ళాం పిల్లలని ముంచి తిరిగి వాళ్ళను నిరాశకు పాలు చెయ్యాలి..."

రామారావు కళ్ళలో నీళ్లు తిరిగాయి.

"వాళ్ళకు తెలుసు...నా మాటలలో నిజం లేదని..." శివయ్య పెదవులమీద జీవంలేని చిరునవ్వొకటి దొర్లింది.

రామారావు కళ్ళు తుడుచుకున్నాడు.

"బ్రదర్! ... క్షమించు... ఏదో ఉద్రేకంలో..."

"లేదు తమ్ముడూ!...నువ్వు బాధ పడకు...నీవంటివాళ్ళు దేశానికి కావాలి."

"శివయ్యా!"

రామారావు ముఖంలో కొత్త వెలుగు తోచింది.

"శివయ్యా!"...రామారావు జేబులో నున్న పర్సు తీశాడు. "నిన్ననే బాంకు నుండి డబ్బుతీశాను ఏదో కొందామనుకున్నాను. తరువాత ఆలోచించవచ్చు దాని గురించి. ప్రస్తుతానికి ఈ డబ్బు వాడుకో" — పదిరూపాయల నోట్లు అయిదు తీసి శివయ్య చేతిలో ఉంచాడు.

"వద్దు తమ్ముడూ! అప్పు తీర్చే తాహతుకూడా నాకు లేదు "

"లేదు, లేదు! తీసుకో!" రామారావు ఆ నోట్లు తీసి చినిగిపోయిన శివయ్య

జేబులో పెట్టాడు. అవి జారిపడిపోతుంటే ఒక కవరులో పెట్టి యిచ్చాడు.

శివయ్య జవాబు చెప్పలేదు. ఆ కవరు రెండు మూడుసార్లు కళ్ళ కద్దుకొని జాగ్రత్తగా డ్రాయరు వెనుక భాగంలో ఉంచాడు.

రామారావు తన సీటులోకి వెళ్ళి కూర్చున్నాడు. కిటికీలోంచి చూచాడు— శైలజ గొడుగు ముడిచి అఫీసు మెట్లె క్కుతున్నది. ఆమెను చూచి పెదవి విరిచి అతను నవ్వుకొన్నాడు.

"చాల వేగం వచ్చావే!" శైలజ రామారావును చూచి పలకరించింది. పక్కనున్న కుర్చీ చూపించాడు.

శైలజ కుర్చీలో కూచుని వానిటీ బాగ్‌లోంచి రుమాలు తీసి ముఖం మీది చెమటను ఒత్తుకుంది. లవండరు వాసనలు అందులోంచి బయలుదేరి రామారావువేపు ప్రయాణం చేశాయి.

"రేపు సెలవుపెడుతున్నాను, పని పూర్తి చేయాలని ముందుగా వచ్చాను. దొరగారు కూడా వస్తానన్నారు. మళ్లా చెప్పడం మరచిపోతానేమో!... రేపు సాయంకాలం పార్టీకి తప్పక రాక తప్పదు సుమా!... వేయి కళ్ళతో నీకోసం..." శైలజ కళ్ళలో చెప్పలేని అనుభూతి...

ఇంతలో బంట్రోతు ఫైళ్లదస్త్రం ఒకటి తెచ్చి మేనేజరుగారి టేబిలు మీద పెట్టాడు.

"వస్తా... ఈ పెద్దమనిషి వస్తే వేళాకోళం చేస్తాడు, శైలజ లేచి నిలబడి రామారావుకో చిరునవ్వు అందించి వెళ్ళిపోయింది.

రామారావు ఆమెతో ఏమీ మాట్లాడ లేదువీదో ఆలోచిస్తున్నాడు.

మేనేజరు లోపలికి వచ్చాడు.

పోలీసువాను ఒకటివచ్చి బయట నిలుచుంది. తొందరగా జవానులు దిగి సర్దుకున్నారు నలువేపులా పేము బెత్తం తిప్పుకుంటూ ఇనస్పెక్టరు గారు లోపలికి వచ్చారు.

మేనేజరు లేచి నమస్కారం చేశాడు ఇనస్పెక్టరుగారికి.

"సెర్చ్‌వారంటు, పంతులుగారూ!" అన్నారు ఇనస్పెక్టరుగారు నాలుగు వేపులకు చూస్తూ.

"ఏమయింది సార్?" మేనేజరు ప్రశ్నించాడు

"ఎవరో శివయ్యట?"

అందరి దృష్టులు శివయ్య మీదికి పోయాయి. మనిషి గాభరాపడు తున్నాడు.

"అతను మా డిస్పాచ్ క్లర్క్ సార్!"

మీ లైసెన్సు క్లార్కుకి కొద్దికాలం కిందటే మా మనిషి డబ్బిచ్చి పోయాడు."

"దేనిగురించి సార్?"

"అతను వెంకటనారాయణగారి తుపాకీ లైసెన్సు రెండురోజులలో ఇచ్చాడు. అందుకు బహుమతి వంద రూపాయలు."

"మా లైసెన్సు క్లార్కు వేరుసార్ !"

రామారావు సీటులోంచి లేచాడు. శివయ్య ముఖంలోకి చూచాడు. శుష్కించిన అతని ముఖంలో ఒక నెత్తురుచుక్క కూడా లేకుండా ఇగిరి పోయింది. శరీరం చెమటపట్టి అతను భూమికి కుంగుతున్నట్లు కనిపించాడు. పరిస్థితి విషమించింది. దావులన్నీ మూసుకున్నాయి.

మేనేజరు టేబిలు దగ్గరికి రామారావు నడిచాడు.

"నమస్కారం నాయుడుగారూ !"

ఆయన రామారావు పెట్టిన నమస్కారం అందుకున్నాడు.

"నేను లైసెన్సుక్లార్కు రామారావుని. బహుశా నాగురించి వెతుకుతున్నట్లుంది."

"మీ పేరు శివయ్య కాదే?"

"ఆ శివయ్య కేమీ తెలీదు. నేమ లేనప్పుడు ఎవరో నా కిమ్మన్నారని ఈ వందరూపాయల కాగితం ఇచ్చాడు."

"గుడ్!..."

"మీరు బహుమతిగా పంపిన వంద రూపాయలు అందుకొన్నాను. ఈ నోటు నంబరు, ఈ చివరను పెట్టిన సంతకం సరిపోయాయో లేదో చూచుకొండి!" రామారావు పర్సులోంచి నూరు రూపాయలనోటు అందరూ చూస్తూండగా బయటికి తీసి ఇనస్పెక్టరుగారిముందు పెట్టాడు,

ఇనస్పెక్టరుగారు డైరీతీసి నోటు నంబరు మరోసారి సరిపెట్టుకున్నారు. నోటు అంచున తన సంతకం కూడా సరిపోయింది,

''మేనేజరుగారూ? మీ లైసెన్సు క్లార్కు రామారావుని అరెస్టుచేస్తున్నాము."

''ఆఫీసుకి కలెక్టరుగారు వచ్చినట్లున్నారు. వారి అనుమతి ముందు తీసుకుని ఈ పని చేస్తే మంచిదేమో!" అన్నాడు మేనేజరు.

"అవును, ఈ రామారావుని ఆయనకు చూపించాలి."

సాదా దుస్తులలో ఉన్న జవాను జేబులోంచి బేడీలు తీశాడు,

''నాయుడుగారూ! వానులో కూర్చోబెట్టిన తరువాత బేడీలు వేస్తేనో...మా అందరికీ కష్టంగా ఉంటుంది" అన్నాడు మేనేజరు.

"పంతులుగారూ! నలుగురికీ తెలియాలి! ఈ గౌరవం అందరికీ లభించదు కదా!"

రామారావు చేతులు చాచాడు. బేడీలు వేసిన తరువాత అతనిని కలెక్టరు గారి దగ్గిరకు తీసుకెళ్ళారు.

మేనేజరు ఫైళ్ళు పక్కకుపెట్టి నిలబడ్డాడు.

అప్పుడే ఆఫీసులోకి వచ్చిన విశ్వనాథం హాజరీ సంతకం పెట్టి నలుగురి వేపు చూశాడు.

"మేనేజరుగారూ! ఇప్పటికైనా తెలిసిందా! ఎవరెటువంటివాళ్లో! అందరూ కబుర్లు చెప్పేవాళ్లే-రెడ్ హాండెడ్‌గా దొరికినవాళ్ళకు కనీసం మూడేళ్ళు ముచ్చటైన ఖైదు. తరువాత...జన్మలో మరి గవర్నమెంటు ఉద్యోగం దొరకదు" అన్నాడు విశ్వనాథం కసినంతా వెళ్ళబోస్తూ.

శివయ్య శరీరం కంపిస్తున్నది. ఎంత ఘోరం! ఎంత ఘోరం ...అతని కళ్ల ఎదుట బిచ్చమెత్తుకుంటున్న పెళ్ళాం పిల్లల బొమ్మలు కనిపిస్తున్నాయి,

"ఈ దెబ్బ నీకు తగలవలసింది!" అన్నాడు మేనేజరు.

శివయ్య తుళ్ళిపడ్డాడు. విశ్వనాథాన్ని ఉద్దేశించి అన్నమాటలకు.

"అదృష్టవంతుడివి. కొత్తగా నీ సీటుకొచ్చిన వాడికి నీ పాపం చుట్టుకొంది".

విశ్వనాథం నవ్వుతున్నాడు.

శివయ్య గుండెలమీద చెయి వేసుకున్నాడు, వేగంగా కొట్టుకుంటున్న గుండె దారిపడుతున్నది,

మేనేజరు కలెక్టరుగారి గదివేపు నడిచాడు,

"ఆదర్శాలు వల్లించే మనుషుల నిజస్వరూపాలు చూద్దాం రండి !" అందరినీ పిలిచాడు విశ్వనాథం.

మేనేజరు వెనుక విశ్వనాథం, శివయ్య ఇంకా మరిద్దరు గుమాస్తాలు కలెక్టరు గారి గదివేపు నడిచారు.

ఆ సరికే రామారావును లోపలికి తీసికెళ్ళారు. డిక్టేషను ఆపి శైలజ బయటికి వచ్చింది.

"రేపు బర్తుడే పార్టీకి, వచ్చేనెల వివాహమంగళానికి రామారావుని వదిలిపెట్టమను" అన్నాడు విశ్వనాథం స్టెనో శైలజ ముఖంమీద.

శైలజముఖం కోపంతో ఎర్రబడింది.

"ప్రియురాలి పుట్టినరోజు కానుక కైపుచ్చుకున్నట్లుంది పాపం!" అన్నాడు విశ్వనాథం మళ్ళా ఆమెనే అల్లరిపెడుతూ.

"షటప్!" తన్నినంతచేసి శైలజ తన గదిలోపలికి వెళ్ళిపోయింది.

కొద్దిసేపటిలో రామారావుని తీసుకొని ఇనస్పెక్టరుగారు బయటికి వచ్చారు. రామారావుముఖం చాల ప్రశాంతంగా ఉంది. ఉదాసీనత ఏ కోశాన్నీ కనిపించలేదు. కాని అందరి ముఖాలలో విచారం వ్యక్తమవుతున్నది.

వానులోకి ఎక్కుతున్న రామారావు అందరికీ కనబడ్డాడు.

ధారలుగా కారుతున్న శివయ్య కతను కనపడలేదు. మరెవరో కనిపించారు,

శివయ్య తన వయసు సంగతి మరచిపోయి రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు తన వేలుపుకి.

---